క్లుప్తంగా

నారాయణపురం కాలువ పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న చిరంజీవి తదితరులు

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లా పరిషత్ నిధులు రూ. పది లక్షలతో చేపడుతున్న పనులను ఎంపీపీ మొదలవలస చిరంజీవితోపాటు స్థానిక నాయకులు బుధవారం పరిశీలించారు. కాలువ ప్రారంభం నుంచి శివారు వరకు పనులు చేస్తున్నారు. షట్టర్లకు సైతం మరమ్మతులు చేపడుతున్నారు. ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ చెప్పారు. ఆయన వెంట నాయకులు బెండు రామారావు, బగ్గు రాజారావు ఉన్నారు.

జోరుగా ఆర్వో ప్లాంట్ నిర్మాణం



వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో భక్తుల కోసం నాణ్యమైన మంచినీటిని అందించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈమేరకు ఆధునిక సాంకేతికతతో కూడిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంటును నగరానికి భక్తదాత పెద్దిన కాళిదాస్ ఆలయానికి సమర్పించారు. భక్తుల విరాళాలతో నిర్మించిన ప్రత్యేక గదిలో ప్లాంటును అమర్చే పనులను ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి కాగానే భక్తులకు మంచినీటిని ఉచితంగా అందించనున్నారు.

ఘనంగా సంతోషిమాత జన్మదిన వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి దేవాలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, 108 లీటర్ల పాలతో అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, మహాలింగార్చనలు, రుద్రాభిషేకాలు, చండీపారాయణ, 13 పట్టుచీరలతో చండీ హోమం, మృత్యుంజయ హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

అయ్యప్పస్వామికి పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం ధర్మ శాస్తా దేవాలయంలోని అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు బుధవారం జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

సక్రమంగా ఉపాధి పనులు



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం పనులను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో నిశ్చల అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్ర స్థాయి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తోటపల్లి, మడ్డువలస ప్రధాన, పిల్ల కాలువల్లో పూడికలను త్వరగా తొలగించేలా వేతనదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. వేతనదారుడికి కనీసం రూ. 272 వచ్చేవిధంగా పనులు చేయాలన్నారు. ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, టీఏలు ఎస్.లక్ష్మణరావు, కీర్తి గణపతి, వై.వైకుంఠరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

ఇంటింటా సంతోషం



మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- పైడిభీమవరం గ్రామ సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రణస్థలం: అర్హత కల్గిన ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పైడిభీమవరం గ్రామ సచివాలయ పరిధిలోని వరిసాం, గొల్లపేట, దేవునిపాలవలస, మక్కుపాలవలస గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతోపాటు నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను చదివి వినిపించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని, అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన స్పందిస్తూ వీలైనంత త్వరగా మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. మళ్లీ ఈ పథకాలన్నీ రావాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, పిల్ల ఆనందరావు పాత్రుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, చినరామినాయుడు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, పైడిభీమవరం ఎంపీటీసీ సభ్యులు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, గ్రామ నాయకులు అల్లంపల్లి బాషా, నారాయణప్పారావు, దాట్ల సురేష్, పిప్పళ్ల వెంకటేష్, డీఎల్‌పీ రాజు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తాత పెన్షన్ వస్తుందా..

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో రామ్‌మనోహర్‌నాయుడు



వృద్ధుడితో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఓ తాతా పెన్షన్ వస్తుందా.. పెన్షన్ కోసం ఎవ్వరికైనా రూపాయి లంచం ఇచ్చావా.. ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ ఇస్తున్నారా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఓ వృద్ధుడ్ని ఆరా తీశారు. దీనికి వృద్ధుడు స్పందిస్తూ జగన్‌బాబు నాకు పెద్దకొడుకు.. తెల్లవారు లేవకముందే వలంటీర్ ఇంటికొచ్చి పెన్షన్ ఇస్తున్నారు బాబు అంటూ ఆనందంగా సమాధానం చెప్పారు. ఈ సంఘటన పెద్దపాడు-2 గాంధీనగర్‌కాలనీలో బుధవారం చోటుచేసుకుంది.

ఈ ప్రాంతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' 98వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయుకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వే



లావేరు:చినకొత్తకోట గ్రామంలో సర్వే చేస్తున్న వలంటీర్లు



జి.సిగడాం: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో నిశ్చల

లావేరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే జరిగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా గ్రామాల్లో సర్వే చేపడుతున్నారు. వలంటీర్లకు ప్రత్యేక యాప్ ఇవ్వడంతో వారికి కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి జగనన్న సురక్షలో చేర్చిన 11 రకాల సేవల వివరాలు ఏమైనా అవసరం ఉందా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి యాప్‌లో నమోదు చేశారు.

ఆనందపురంలో..

జి.సిగడాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, వలంటీర్లు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో నిశ్చల అన్నారు. ఆనందపురంలో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. వివిధ సర్టిఫికెట్లను ఈ కార్యక్రమం ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి పైల జయరాం ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈవో తిరుమలచైతన్య

శ్రీకాకుళం అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళంలోని ఎల్‌డీఎం కార్యాలయంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో తిరుమలచైతన్య మాట్లాడుతూ భారతీయ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగం, అఖిల భారత స్కూల్ క్విజ్ 2023లో భాగంగా గత నెల 21వ తేదీన జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే క్విజ్ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఎం.సూర్యకిరణ్, ఎంఈవో ఎన్.కృష్ణ, స్వర్ణకుమారి, పీఆర్‌టీయూ ప్రతినిధి దామోదర్, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మారు రథయాత్ర



తిరుగు ప్రయాణంలో జగన్నాథుని రథం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఇల్లీసుపురం కూడలి వద్ద పది రోజులుగా జరిగిన జగన్నాథ రథయాత్ర ఉత్సవం బుధవారం మారు యాత్ర.. తిరువీధి ఉత్సవంతో ముగిసింది. బొందిలీపురంలో ఉన్న సదావర్తి పులహోరీ తఖియామఠంలో కొలువైన సుభద్ర, బలభద్రల సమేత జగన్నాథస్వామి మూర్తులను పూరీ సంప్రదాయంలో పూజలు మఠం నిర్వాహకులు నిర్వహించారు. సాయంత్రం జగన్నాథ, సుభద్ర, బలభద్రుల ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేర్చారు. ఈ రథం వెంట మేళతాళాలు, భజనలతో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ



విత్తనాలను అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: వాండ్రంగి రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, సర్పంచ్ సాకేటి నాగరాజు విత్తనాలను అందజేశారు. ఉపసర్పంచ్ డబ్బాడ రామారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అరసవిల్లి దివ్య ఉన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే



తాళ్లవలసలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: లావేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కుష్టు వ్యాధి సర్వేను వైద్య సిబ్బంది బుధవారం చేపట్టారు. సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి స్పర్శలేని మచ్చలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

వేణుగోపాలపురంలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న దృశ్యం

లావేరు: గుమడాం పంచాయతీ పరిధి వేణుగోపాలపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు విధానంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని ఉప సర్పంచ్ దురసాగి ధర్మారావు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

శ్రీరామ పట్టాభిషేక అవతారంలో జగన్నాథుడు



శ్రీరామపట్టాభిషేక అవతారంలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలో జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గుజరాతీపేటలోని జగన్నాథస్వామిని శ్రీరామ పట్టాభిషేక అవతారంలో బుధవారం అలంకరించారు. సుభద్ర, బలభద్రులతో పాటుగా జగన్నాథ స్వామిని ప్రత్యేకగా అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రణస్థలం: కొండములగాం ఆదర్శ పాఠశాలలో మిగుల సీట్ల భర్తీ కోసం బుధవారం ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఏడో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో రెండు, తొమ్మిదో తరగతిలో ఒక సీటు కోసం పరీక్ష నిర్వహించగా 154 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. రెండు రోజుల్లో ఫలితాలు వెల్లడించి అర్హులైన వారికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ టేకి బ్రహ్మాజీ ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎం.వి.స్వరూప్



పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం పట్టణానికి బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.
–శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నీట్ ర్యాంకర్ ఆశీష్‌కు సన్మానం



ఆశీష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆశీష్ లాంటి విద్యార్థి కళింగ సామాజిక వర్గంలో పుట్టడం జాతికే గర్వకారణమని కళింగ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కంచరాన నాగభూషణరావు అన్నారు. నీట్-2023లో ఆలిండియా స్థాయిలో ఓబీసీ విభాగంలో 12, జనరల్ కేటగిరీలో 57వ ర్యాంకు సాధించిన పాట్నూరు ఆశీష్‌ను శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న కళింగ భవన్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆశీష్ ప్రతిభను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు డాక్టర్ పాట్నూరు సూర్యం, ఆశాలత, పశుసంవర్ధకశాఖ జేడీ ఎం.కిశోర్, డీడీ జగన్నాథం, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, సంఘనాయకులు దానేటి రాజశేఖర్, చింతాడ అప్పలనాయుడు, అన్నాజీభట్లు, సనపల అన్నాజీ, పిట్ట చంద్రపతిరావు, గద్దిబోయిన కృష్ణయాదవ్, కంఠ వేణు, రామ్‌గోపాల్, బడియా కామరాజు, గురుగుబెల్లి రామచంద్రరావు, పైడి సాంబమూర్తి, పప్పల అన్నాజీరావు పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతికి సంతాపం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీనియర్ జర్నలిస్టు అంబటి ఆంజనేయులు మృతి పాత్రికేయులకు తీరనిలోటని శ్రీకాకుళం జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. ఆంజనేయులు సంతాప సభను శ్రీకాకుళం బీసీ న్యాయవాదుల అసోసియేషన్, జర్నలిస్టు అడ్వకేట్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు జర్నలిస్టుల కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టు సంఘం నాయకుడు చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, బి.వి.రమణ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: పైడిభీమవరం, ఎర్రవరం సబ్ స్టేషన్ల పరిధిలోని వరిసాం, నారువ, పైడిభీమవరం, ఎర్రవరం, గోసాం, వి.ఎన్.పురం గ్రామాలకు, పరిశ్రమలకు ఈ నెల 30వ తేదీన విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యాన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో 30 రోజుల టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వచ్చేనెల ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తొమ్మిదో తరగతి చదివి 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించాలి.

పరామర్శ



పతివాడపాలెం గ్రామంలో పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: పిషిణి పంచాయతీ పతివాడపాలెం గ్రామంలో మహంతి కృష్ణ తండ్రి తాత ఇటీవల మరణించారు. అలాగే సంచాం పంచాయతీ పెసలపాలెం గ్రామంలో పెసల కృష్ణమూర్తి కుమారుడు గోవింద ఇటీవల మరణించారు. వీరి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పిషిని సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, నాయకులు పతివాడ సత్యం, బొంతు వెంకటేష్, మంత్రి సోమునాయుడు, పతివాడ భవానీ శ్రీను, పెసల శ్రీను, పెసల పండోడు, నాసరి అప్పలస్వామి, బాడి తమాన రామారావు, గోవింద, నాసరి దాలివాడు తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వచ్చే జనవరి నాటికి ఓటర్ల జాబితాను పక్కాగా సిద్ధం చేయనున్నామని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు తమవంతు సహాయం అందివ్వాలని నరసన్నపేట ఆర్వో జి.జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు, నిబంధనలు వివరించారు.

జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓటర్ల జాబితలో తప్పుల సవరణ, తొలగింపు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి నెల రోజులపాటు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారన్నారు. వెయ్యికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిని విభజించే అవకాశం ఉందన్నారు. మరణించే వారిపేర్లు, మైగ్రేషన్ అయిన వారిపేర్లు పరిశీలించి గ్రామస్తుల అంగీకారంతోజాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఒకరి పేరు ఒకచోటే ఉండాలన్నారు. ఒక కుటుంబం పేర్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రాల్లో ఉంచేలా చూడాలని ఎంపీపీ ఆరంగి మురళి కోరారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆర్వోకు వినతిపత్రమిచ్చారు.